క్లుప్తంగా

ఘోషా ఆస్పత్రిలో మాతా,శిశు సేవలు

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు, గైనిక్ సంబంధిత వ్యాధులకు, పిల్లలకు ఘోషా ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ సంబంగి అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనిక్, పిడియాట్రిక్ వార్డుల ద్వారా మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భోగాపురం: కొమ్మూరు అప్పడుదొర మెమోరియల్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను అలరించాయి.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

పూసపాటిరేగ: బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సఖీపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 10 నుంచి 19 సంవత్సరాల బాలికలకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే యుక్తవయసు అమ్మాయిలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్‌వర్మ, అంగన్‌వాడీ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ

భోగాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి మండల కేంద్రంలో గల ఓటర్లకు వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ ఈఓ ఎ.రవితేజ శనివారం స్లిప్పులు పంపిణీచేశారు. మండల కేంద్రంలో మొత్తం 234 మందికి స్లిప్పులు అందజేశామని తెలిపారు.

అలరించిన భక్తి కళారాధన

నెల్లిమర్ల రూరల్: దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన భక్తి కళారాధన భక్తులను అలరించింది. ధర్మపథం పేరిట మెరకముడిదాం మండలం గోపన్నవలస గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృంద సభ్యులు స్వామివారి సన్నిధిలో భజనలు చేశారు. ఈఓ ప్రసాదరావు వారిని అభినందిస్తూ దేవదాయశాఖ తరఫున ప్రశంసాపత్రాలు అందజేశారు.

దేవరకొండకు అభినందనలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: తల్లి లాంటి తెలుగు భాషను, తెలుగు కీర్తిని వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇటీవల జరిగిన పీఎం యువ మెంటార్‌షిప్‌నకు ఎంపికైన దేవరకొండ ప్రవీణ్‌కుమార్ కోలగట్ల వీరభద్రస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీబీ శ్రీనివాస్, గన్నవరపు శ్రీనివాస్, సరిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో స్నేహపూర్వక వాతావరణం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: వసతి గృహాల్లో స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక వెనుకబడిన తరగతి జిల్లా అధికారి కార్యాలయంలో వసతి గృహ సంక్షేమ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్‌మీడియట్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఒత్తిడి లేకుండా చదివించాలని సూచించారు. సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు జి.హిమబిందు, జిల్లా సంక్షేమ అధికారి ఎం.యశోధరావు, జిల్లా ఉప సంక్షేమ అధికారులు శ్యామలకుమారి, బీవీ రమణకుమారి, డీసీపీయూ అల్లు సత్యనారాయణ, యాళ్ల నాగరాజు, సంధ్య, సరస్వతి పాల్గొన్నారు.

వేసవిలో నో టెన్షన్..

- నగరంలో తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళికలు
- రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు
- మూడు పంప్‌హౌస్‌ల నుంచి ప్రతిరోజూ 27 ఎంఎల్‌డీ నీరు పంపింగ్
- వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా రూ.65.37 లక్షలతో ప్రణాళికలు

విజయనగరం:

వేసవి వచ్చేసింది. సూర్యభగవానుడి భగభగలు ప్రారంభమయ్యాయి. ఇటువంటి పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. 3 లక్షలకు పైగా జనాభా కలిగిన విజయనగర నగర ప్రజలకు రానున్న మూడు నెలలు వర్షాకాలంతో సమానంగా రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం రూ. 65.87లక్షలతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. 2019 ఎన్నికలకు ముందు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగర ప్రజలు తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో సాధారణ రోజుల్లోగానే వేసవిలో కూడా రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా నీటి సరఫరా చేసే దిశగా చర్యలు ప్రారంభించారు.

27 ఎంఎల్‌డీ నీరు పంపింగ్..

నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాల నుంచి ప్రతిరోజూ 27 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆ మొత్తాన్ని నగరంలోని 34 రిజర్వాయర్లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ద్వారా ఒక రోజు 25 డివిజన్‌లకు, మరో రోజు 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు.



రక్షిత మంచి నీటిపథకాల పరిస్థితి తెలుసుకుంటున్న పబ్లిక్ అండ్ హెల్త్ ఎస్ఈ, కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు

ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచి నీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తుండగా.... ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావుల నుంచి మరో 10 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ అవుతోంది. ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి వేసవి అంతా నీటిని పంపింగ్ చేసేందుకు అవసరమైన నిల్వలు ఉండగా.. నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాలు ఉండే చంపావతి నదిలో మార్చి నెలాఖరు నాటికి నీటి నిల్వలు అడుగంటిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎగువన ఉన్న ఆండ్ర రిజర్వాయర్ నుంచి 43 కిలోమీటర్ల దూరంలో గల చంపావతి నదిలోకి నీటిని మళ్లించేందుకు ఇప్పటికే ఇరిగేషన్ అధికారులతో పబ్లిక్ అండ్ హెల్త్ విభాగం, కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు చర్చలు జరిపారు. ఆండ్ర రిజర్వాయర్ నుంచి వేసవి మొత్తానికి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేందుకు పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వేసవి ప్రత్యేక ప్రణాళికలివే...

వేసవి నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా రూ.65.37 లక్షలతో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.

- చంపావతి నదిలో ఉన్న నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచి నీటి పథకాల వద్ద రూ. 9.25 లక్షలతో ఊటబావుల చుట్టూ ఇసుక బస్తాలు వేయాలని నిర్ణయించారు.
- ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం వద్ద రూ. 9.99 లక్షలతో ఊటబావుల చుట్టూ ఇసుక బస్తాలు వేసి నీటిని నిల్వ చేయనున్నారు.
- నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకాలలో పూడికలు తీసేందుకు రూ.15.80 లక్షలు ఖర్చు చేయనున్నారు.
- బోర్ల ఫ్లషింగ్‌కు రూ.10 లక్షలు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.11.10 లక్షలు ఖర్చుగా ప్రతిపాదించారు.
- ఆండ్ర రిజర్వాయర్ నుంచి 43 కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిమర్ల పంప్ హౌస్ ఉన్న చంపావతి నదిలోకి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేందుకు రూ. 9.95 లక్షలు ఖర్చు చేయనున్నారు.



కుళాయిల వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు



నెల్లిమర్ల వద్ద చంపావతి నదిలో పంప్‌హౌస్

ప్రాంతం: విజయనగరం కార్పొరేషన్	
మొత్తం డివిజన్‌లు:	50
నివసిస్తున్న జనాభా :	3 లక్షలకు పైగా
నగరానికి నీటిని అందించే పంప్ హౌస్‌లు :	3
ప్రతి రోజు పంపింగ్ చేస్తున్న నీరు :	27 ఎంఎల్‌డీ
నగరంలోని మొత్తం రిజర్వాయర్ల సంఖ్య :	34
వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ఖర్చు చేసే మొత్తం :	రూ.65.37 లక్షలు
నగరంలో పబ్లిక్ కుళాయిల సంఖ్య :	425
వ్యక్తిగత కుళాయిల సంఖ్య :	34,000

రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు



మండువేసవిలో నగర ప్రజలకు రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవి ప్రణాళికలో భాగంగా రూ.65.37 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోయే సమయానికి ఆండ్ర రిజర్వాయర్ నుంచి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపడుతున్నాం. అంతేకాకుండా మూడు రక్షిత మంచి నీటి పథకాల వద్ద నిర్వహణ పనులు చేపట్టనున్నాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం

- సెబ్ అడిషనల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్

విజయనగరం: చెడు వ్యసనాలతో జీవితాలు నాశనమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఆస్మా ఫర్హీన్ సూచించారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తిరుమల నర్సింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, మహిళల అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్‌లపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అమ్మాయిలు గుడ్/బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మెడికల్ కళాశాల సైకాలజిస్ట్ ఎస్‌వీ రమణకుమార్ మాట్లాడుతూ, చెడు అలవాట్లతో మానసిక రుగ్మతలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి డి అడిక్షన్ సెంటర్ వైద్యుడు హరీష్, సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, సెబ్ అధికారులు శైలజారాణి, బి.మధుకుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెబ్ అడిషనల్ ఎస్పీ ఆస్మా ఫర్హీన్

మహిళా ప్రగతి సామాజిక అభివృద్ధికి కొలమానం

- వాకర్స్ క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం

విజయనగరం: మహిళా ప్రగతి సామాజిక అభివృద్ధికి కొలమానమని వాకర్స్ క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. పట్టణంలోని మహారాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలో భాగంగా మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. వాకర్స్ క్లబ్ పోర్టు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు కూడా అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం క్లబ్ డిప్యూటీ గవర్నర్ సుభద్రాదేవి వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన మహిళలు పాకలపాటి రమణమ్మ, తాళాబత్తుల అమ్మాజీ, మృదుభాషిని, సన్యాసమ్మ, రాజేశ్వరిలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ సాయిసంతోషిణి, సీహెచ్ పార్వతి, సభ్యులు డాక్టర్ బి.రాధికారాణి, ఆర్.ధనలక్ష్మి, గురజాడ ఇందిర, పూర్వపు గవర్నర్ రాజు, విజయ్‌కుమార్, విశ్వనాథం, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు

మహిళా దినోత్సవంలో భాగస్వాములు కావాలి

నెల్లిమర్ల: పట్టణంలో ఈ నెల 9న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవం, సఖి గ్రూపుల నిర్వహణపై స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆ రోజు పట్టణంలో నిర్వహించే ర్యాలీలో డ్వాక్రా మహిళలు, ఏఎన్ఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. అలాగే పట్టణంలోని 20 వార్డుల్లో సఖి గ్రూపులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

సుధాకర్ గెలుపే లక్ష్యం...

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో వైఎస్సార్‌సీపీ తరఫున నిలిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సుధాకర్‌కు మద్దతుగా విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, మండల స్థాయి నాయకులు పట్టభద్రులను నేరుగా కలిసి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని కోరారు. – విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం: ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు



భోగాపురం: ముంజేరులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ, తదితరులు



నెల్లిమర్ల: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, అందవరపు సూరిబాబు



పూసపాటిరేగ: పతివాడలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నెల్లిమర్ల రూరల్: సతివాడలో పట్టభద్రులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, తదితరులు

ముగిసిన శ్రీవారి కల్యాణం



ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసుదేవరావు, బెటాలియన్ పోలీస్ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసన్నకుమారి మృతి తీరని లోటు

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆర్‌వీ ప్రసన్నకుమారి అకాల మరణం సంగీత రంగానికి తీరని లోటని కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు ద్వారం దుర్గాప్రసాదరావు, బి.అనురాధ పరశురాం అన్నారు. శనివారం స్థానిక కళాశాల ఆవరణలో ప్రసన్నకుమారి సంస్మరణ సభ నిర్వహించారు.

సుధాకర్ విజయానికి కృషి చేయాలి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన సభ్యులతో కలిసి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తపాలా శాఖ ఎన్నికల్లో ఎన్‌ఎఫ్‌పీఈ క్లీన్‌స్వీప్

విజయనగరం టౌన్: తపాలాశాఖ యూనియన్ సొసైటీ ఎన్నికలలో నేషనల్ ఫెడరేషన్ పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ క్లీన్‌స్వీప్ చేసి తొమ్మిది డైరెక్టర్ల పదవులను కైవసం చేసుకుంది. శనివారం స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఎన్నికలు నిర్వహించారు. శంకర్‌నాయుడు, పతివాడ శ్రీనివాసరావు, ఉడికల శ్రీనివాసరావు, ఎస్.సత్యారావు, వి.రుద్రప్రతాప్, ఎస్.సుధాకర్, పి.అప్పలకృష్ణ, పెంట పాపయ్య, ఎ.నాగేశ్వరరావు డైరెక్టర్లుగా ఎంపికయ్యారు.

పక్కాగా రికార్డులు

విజయనగరం ఫోర్ట్: స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డెమో వెంకటరమణ, చిన్నతల్లి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ప్రణాళికా ప్రకారం చదవాలి

విజయనగరం పూల్‌బాగ్: ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని డైట్ లెక్చరర్ (సైకాలజీ) డి. ఈశ్వరరావు అన్నారు. దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రమణమ్మ, ఉపాధ్యాయులు రత్నం, సంజీవరావు, నాగసింహాచలం, శ్యామల, హేమామాలిని, తదితరులు పాల్గొన్నారు.

బాబా గంధ మహోత్సవంలో పాల్గొన్న అవనాపు

విజయనగరం: హజరత్ ఖాదర్ షావలి 64వ గంధ మహోత్సవం విజయనగరం బాబామెట్ట దర్బార్‌లో శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. దర్గా సంప్రదాయానుసారం దర్బార్ షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త) డాక్టర్ ఎం.డి ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ అవనాపు విక్రమ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ, గంధమహోత్సవం చివరి రోజు బాబా ఆశీస్సులు లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు జాఫర్ షరీఫ్, ఖ్వాజా మొహముద్దీన్, రాజు, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.



గంధ మహోత్సవంలో అవనాపు విక్రమ్

సదుపాయాలుంటేనే అనుమతులు

పూసపాటిరేగ: మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే కందివలస సంత నిర్వహణకు అనుమతులు మంజూరు చేస్తామని డీఎల్‌పీఓ ఎ.మోహనరావు అన్నారు. మండలంలోని కందివలస సంతలో మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ, సంతలో సీసీ కెమెరాలు, పశువులకు షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సంతకు వచ్చిన క్రయ,విక్రయదారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గో సంరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, గో సంరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గోసంరక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానటరింగ్ కమిటీ సభ్యులు

ఎమ్మెల్సీకి సత్కారం

నెల్లిమర్ల: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుకు తూర్పు గోదావరి జిల్లా గంటి పెదపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. వి.గన్నవరం ఎమ్మెల్సీ కొండేటి చిట్టిబాబు, కాకినాడ జెడ్పీ చైర్మన్ ఇప్పత్తి వేణుగోపాల్, తదితరులు సురేష్‌బాబును ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన ఆయనకు అభినందనలు తెలియజేశారు.



సురేష్‌బాబును సత్కరిస్తున్న చిట్టిబాబు, వేణుగోపాల్, తదితరులు

జాగ్రత్తలు తీసుకోవాలి

డెంకాడ: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. మండలంలోని మోపాడ కేజీబీవీలో సఖి కార్యక్రమం పేరిట పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ స్వరూపారాణి మాట్లాడుతూ, చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. అనంతరం ఆమె మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ సీహెచ్.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పి.భవానీ, ఎంపీహెచ్ఎస్ ఎస్.సూరిబాబు, సీహెచ్ఓ కె.గీత, ఏఎన్ఎం సుష్మ, ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ పాల్గొన్నారు.